జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | శనివారం 18 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 160 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం విశేషం: అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినోత్సవం, స్కంద పంచమి సూర్యోదయం: 5:35 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 9:14 । చంద్రాస్తమయం: 9:49 తిథి: శుద్ధ చవితి ఉ. 8:35 వరకు, తదుపరి పంచమి నక్షత్రం: పుబ్బ రా. 10:32 వరకు, తదుపరి ఉత్తర యోగం: వరియాన్ రా. 1:49 వరకు, తదుపరి పరిఘ కరణం: బవ ఉ. 8:35 వరకు, తదుపరి బాలువ రా. 8:06 వరకు, తదుపరి కౌలవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

# నిజాంసాగర్ నీళ్లొచ్చేనా?

- ఆశగా ఎదురు చూస్తున్న రైతులు
- ఆయకట్టు కింద ఊపందుకున్న నాట్లు
- సాగర్‌లో ప్రస్తుతం 6.50 టీఎంసీలు
- నీటి విడుదలపై స్పష్టత కరువు
- వానకాలం పంటలు గట్టెక్కడంపై అనుమానాలు



నిజాంసాగర్

జూలై 16: చినుకు జాడ కరువైన తరుణంలో రైతాంగం నిజాంసాగర్ వైపు ఆశగా చూస్తున్నది. ప్రాజెక్టులో సంతృప్తికర స్థాయిలో నీళు ఉండడంతో ఆయకట్టుకు ఎప్పుడు నీటి విడుదల చేస్తారా? అని ఎదురు చూస్తున్నది. ఇప్పటికే నార్లు పోయడం, నాట్లు ఊపందుకుంటున్న తరుణంలో నీటి విడుదల విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. వర్షాలు ముఖం చాటేయడం, ఎండలు దంచి కొడుతుండడంతో నార్లు ఎండుముఖం పడుతున్నాయి. నాట్లు వేసిన పొలాలు నీరందక నెర్రెలు వారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**జాడలేని వానలు.. ఆందోళనలో రైతులు..**

పంటల సాగులో నిమగ్నమైన రైతులను వర్షాభావ పరిస్థితులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈసారి వానలు పెద్దగా కురియడం లేదు. వర్షాకాలం ఆరంభమై దాదాపు ఒకటిన్నర నెలలు దాటినా భారీ వర్షాలు లేకుండా పోయాయి. కరువు పరిస్థితులు గోచరిస్తున్న తరుణంలో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాంసాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలువురు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. మరోవైపు, నిజాంసాగర్ నీటిని విడుదల చేసి పంటలను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఇటీవల ఆందోళన చేపట్టింది. ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో కోటగిరి మండలంలో మహా రైతుధర్నా నిర్వహించారు.

**9 టీఎంసీలు అవసరం**

నిజాంసాగర్ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1394.58 అడుగుల (6.55 టీఎంసీల) మేర నీరు నిల్వ ఉంది. అయితే, ఆవిరి రూపంలో, లీకేజీ రూపంలో 1.50 టీఎంసీల నీరు వృథాగా పోతుంది. అర టీఎంసీ నీరు డెడ్ స్టోరేజీగా ఉంటుంది. అంటే, రెండు టీఎంసీల నీళ్లు పోనూ మిగిలేది 4.50 టీఎంసీలు మాత్రమే. ఆయకట్టు పంటలు గట్టెక్కాలంటే మొత్తం 9 టీఎంసీలు అవసరం. ఇప్పుడున్న 4.50 టీఎంసీలకు తోడు మరో నాలుగు టీఎంసీలు అవసరమవుతాయి. ఒకవేళ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురియకపోతే పంటలు గట్టెక్కడం కష్టమేనని ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు, సాగర్ నుంచే బోధన్, నిజామాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే, నీటి విడుదలపై స్టేట్ లెవల్ కమిటీ ఫర్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటీ (శివమ్) నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే ఈ కమిటీ భేటీ అయ్యే అవకాశముందని తెలిసింది.

**నీటి విడుదలపై స్పష్టత కరువు**

నిజాంసాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలంటూ రైతులు కోరుతున్నప్పటికీ అటు అధికారుల నుంచి ఇటు ప్రభుత్వం నుంచి స్పందన రావడం లేదు. ఇటీవల అన్నదాతలు నీటిపారుదల శాఖ అధికారులను కలిసి మొర పెట్టుకోగా, జూలై 7వ తేదీన డీఐబీ సమావేశం ఏర్పాటు చేసి, నీటి విడుదలపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. కానీ వారు చెప్పిన గడువు దాటిపోయి పది రోజులవుతున్నది. కానీ డీఐబీ భేటీ మాత్రం జరుగలేదు. ఈ నేపథ్యంలో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సమన్వయంతో పనిచేయాలి

- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు




## గార్గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజన తనిఖీ

- భిక్నూర్ ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు
- పాడైన ఆహారం ధ్వంసం -- పరిశుభ్రత పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



## ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయమే జిల్లా అభివృద్ధికి బాట




- దిశా సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కర్ పిలుపు
- వ్యవసాయం నుంచి విద్య వరకు అన్ని శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష
- పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు

# ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయమే జిల్లా అభివృద్ధికి బాట

**దిశా సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కర్ పిలుపు**

**వ్యవసాయం నుంచి విద్య వరకు అన్ని శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష**

**పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు**




**కామారెడ్డి, ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హ లబ్ధిదారునికి సకాలంలో ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా దిశా కమిటీ చైర్మన్ సురేష్ షెట్కర్ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా దిశా కమిటీ సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కర్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, డీఆర్‌డీఏ పీడీ దామోదర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడమే అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట బీమా, ఇతర ఆర్థిక సహాయ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి రైతులకు సాంకేతిక సూచనలు, ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీరు, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ తదితర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆరుతడి పంటల సాగుపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఉపాధి హామీ పనులను నిరంతరం పర్యవేక్షించి గ్రామీణ కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ దిశా సమావేశంలో ప్రజాప్రతినిధులు చేసిన సూచనలు, సిఫారసులను అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం విశేషం. అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తే జిల్లా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.

# గార్గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజన తనిఖీ

**భిక్నూర్ ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడులు**

**పాడైన ఆహారం ధ్వంసం -- పరిశుభ్రత పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**




**కామారెడ్డి ప్రతినిధి, జూలై 17 (ప్రజా జ్యోతి):** జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ గారు గార్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాఠశాల వంటశాల, ఆహార పదార్థాల నిల్వ విధానం, వంట చేసే ప్రాంతం, తాగునీటి సౌకర్యాలు, వంట పాత్రల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతతో పాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శుభ్రమైన నీటిని వినియోగించడం, ఆహార పదార్థాలను సరైన విధంగా నిల్వ ఉంచడం, వంటశాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ భిక్నూర్ పట్టణంలోని పలు ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వంటశాలలు, ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, వంట నూనెల వినియోగం, పరిశుభ్రత, ఆహార నిల్వ విధానాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన పాడైపోయిన, వినియోగానికి అనర్హమైన ఆహార పదార్థాలను గుర్తించి వెంటనే ధ్వంసం చేయించారు. రెస్టారెంట్ యజమానులు, నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేస్తూ ఆహార తయారీ నుంచి వినియోగదారులకు వడ్డించే వరకు ప్రతి దశలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వంటశాలల్లో ఈగలు, ఎలుకలు, ఇతర కీటకాలు రాకుండా సమర్థవంతమైన పెస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలను నిర్ణీత ఉష్ణోగ్రతలో నిల్వ ఉంచడం, గడువు ముగిసిన లేదా పాడైన ఆహారాన్ని వినియోగించకుండా వెంటనే తొలగించాలని హెచ్చరించారు. ప్రతి ఫుడ్ బిజినెస్ ఆపరేటర్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ () కలిగి ఉండాలని, లైసెన్స్ లేని ఆహార వ్యాపార సంస్థలు వెంటనే లైసెన్స్ పొందాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్లపై ఆహార భద్రత చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ శాఖ ఇటువంటి ఆకస్మిక తనిఖీలను నిరంతరం కొనసాగిస్తుందని, నాణ్యతలేని లేదా కలుషిత ఆహారాన్ని విక్రయించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి. విక్రమ్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే వినియోగించాలని, నాణ్యతపై అనుమానం ఉన్న ఆహార పదార్థాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బిచ్కుంద రూ.43 లక్షలతో జూనియర్ కళాశాల అభివృద్ధి




**బిచ్కుంద 17 జులై ( ప్రజా జ్యోతి )** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు సహకారంతో బిచ్కుంద జూనియర్ కళాశాల ఆధునీకరణ. రూ.43 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నట్లు వెల్లడి. బిచ్కుంద (కామారెడ్డి) స్థానిక ఎమ్మెల్యే సహకారం తో బిచ్కుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి దిశగా మరో అడుగు ముందుకు పడింది. కళాశాల లో నూతన సూచిక బోర్డు ను ఏర్పాటు చేయగా, కళాశాల ఆవరణలో ఇతర మరమ్మత్తు పనులు కొనసాగుతున్నట్లు కళాశాల కమిటి కార్యదర్శి, బిచ్కుంద మున్సిపల్ కౌన్సిలర్ అసద్ అలీ తెలిపారు. కళాశాల అభివృద్ధి పనుల కోసం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు 43 లక్షలు మంజూరు చేయడంతో కళాశాల మౌళిక సదుపాయాల అభివృద్ధి కి ఊతం లభించింది. ఈ నిధులతో కళాశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్య వాతావరణం కల్పించేందుకు గాను అవసరమైన పనులు చేపడుతున్నట్లు అసద్ అలీ తెలిపారు. కళాశాల అభివృద్ధి కి సహకరించిన ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు కు కళాశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ కళాశాలలో చేపట్టుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.కార్యక్రమం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, లెక్చరర్ శివ, సీనియర్ అసిస్టెంట్ రజాక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఖలీల్ తోపాటు కళాశాల లెక్చరర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# తడి హిప్పర్గ నాలుగు రకాల చెత్తను వేరు చేయడంపై విస్తృత అవగాహన కార్యక్రమం

**పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**: సర్పంచ్ కంకర్నె అశ్విని సుదర్శన్**





**బిచ్కుంద , జూలై 17 (ప్రజా జ్యోతి)** మద్నూర్ మండలం తడి హిప్పర్గ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు రకాల చెత్తను వేరు చేసి నిర్వహించే విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన గ్రామం-ఆరోగ్యకరమైన సమాజం అనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గ్రామస్థులకు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీకి అందించాలని సూచించారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభమవడంతో పాటు పునర్వినియోగానికి అవకాశం ఉంటుందని, గ్రామంలో పరిశుభ్రత మెరుగుపడి దోమలు, ఈగలు, దుర్వాసనలు తగ్గి అంటువ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని వివరించారు. గ్రామ సర్పంచ్ కంకర్నె. అశ్విని సుదర్శన్. మాట్లాడుతూ ప్రతి కుటుంబం చెత్తను వేరు చేసి అందించడం తమ సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపేందుకు గ్రామ పంచాయతీ పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. పరిశుభ్రత అనేది ఒక్క గ్రామ పంచాయతీ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి గ్రామస్తుడు తన వంతు బాధ్యతగా భావించి స్వచ్ఛతకు సహకరించాలని కోరారు.ఉప సర్పంచ్ అంజలి.మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే వేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి జాదవ్.మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామస్తుడు విజయవంతం చేయాలని కోరారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా చెత్త వర్గీకరణను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామ ప్రజలతో కలిసి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించి, చెత్త వేరు చేసే విధానం, వాటి సేకరణ, నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకర్నె అశ్విని సుదర్శన్.ఉప సర్పంచ్ అంజలి ప్రాల్హాద్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి జాదవ్ , గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సమన్వయంతో పనిచేయాలి

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

జిల్లా అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు






**కామారెడ్డి, జూలై 16 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలో నెలకొంటున్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను పంటల మార్పిడి వైపు ప్రోత్సహించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యా శాఖ పనితీరు, వాతావరణ పరిస్థితులు, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. రైతులకు ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రీయ అవగాహన కల్పించి అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతువేదికలను వేదికగా ఉపయోగించుకుని వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సలహాలు, పంటల మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి ఆర్థిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, జిల్లాలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీలు) పరిసరాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామపంచాయతీల ద్వారా చెత్తాచెదారం తొలగించి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, పంచాయతీరాజ్ శాఖలకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో తాగునీటి కొరత ఏర్పడకుండా అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలు వెంటనే పరిశీలించి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని తమ శాఖల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. జిల్లా అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యా లక్ష్యాల సాధన, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై వేగవంతమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

# హైదరాబాద్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కామారెడ్డి పోలీసుల సత్తా

కరాటే, రెజ్లింగ్ విభాగాల్లో రెండు కాంస్య పతకాలు

-- ఎస్పీ రాజేష్ చంద్ర అభినందనలు




**కామారెడ్డి ప్రతినిధి, జూలై 17 (ప్రజా జ్యోతి):** హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్--2026లో కామారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది అసాధారణ ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకుని జిల్లా పోలీసు శాఖకు మరోసారి గర్వకారణంగా నిలిచారు. క్రీడా రంగంలోనూ కామారెడ్డి పోలీసులు తమ ప్రతిభను చాటుతూ జిల్లా ప్రతిష్ఠను రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు. పోటీల్లో సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వినయ్ రెడ్డి కరాటే అండర్-60 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కాంస్య పతకం సాధించారు. బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొంటూ క్రమశిక్షణ, నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో పోటీపడి ఈ విజయాన్ని అందుకున్నారు. అదేవిధంగా ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీస్ కానిస్టేబుల్ గౌతమ్ ప్రభు 90 కిలోల రెజ్లింగ్ విభాగంలో అద్భుత ప్రతిభ ప్రదర్శించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆయన ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఈ విజయాల నేపథ్యంలో కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ పతక విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు కూడా సాధించవచ్చని సూచించారు. పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, మానసిక ధైర్యం, జట్టు స్ఫూర్తి పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ తెలిపారు. ఇటువంటి పోటీలు సిబ్బందిలో పోటీతత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచి విధి నిర్వహణలో మరింత సమర్థతను తీసుకువస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి కామారెడ్డి జిల్లా పోలీసు శాఖకు, తెలంగాణ పోలీసు శాఖకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో జిల్లా పోలీసు సిబ్బందిలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

# ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్‌తో ఐఐటీలో సీటు సాధించిన విష్ణుచరణ్ రెడ్డికి సన్మానం

సదాశివనగర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అభినందనలు

-- గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచిన విద్యార్థి



**కామారెడ్డి ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి):** కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సదాశివనగర్ గ్రామానికి చెందిన విద్యార్థి కోతి విష్ణుచరణ్ రెడ్డి మరోసారి నిరూపించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ గ్రామానికి చెందిన రైతు కోతి దేవరెడ్డి కుమారుడైన విష్ణుచరణ్ రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా స్థాయిలో సుమారు 18 వేల ర్యాంకు సాధించారు. అనంతరం ఆర్థికంగా బలహీన వర్గాల ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ద్వారా మెరుగైన అవకాశం లభించడంతో లిఝార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐ ఐ టి ధన్బాద్ )లిలో ప్రవేశం పొందారు. ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరీలో సుమారు 2,750 ర్యాంకు ఆధారంగా ఆయనకు ప్రతిష్ఠాత్మక ఐఐటీలో సీటు లభించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సాధారణ రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి అత్యున్నత విద్యాసంస్థలో ప్రవేశం పొందడం గ్రామ ప్రజల్లో గర్వకారణంగా మారింది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ డబ్ల్యు ఎస్ రిజర్వేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయానికి విష్ణుచరణ్ రెడ్డి విజయం ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. విష్ణుచరణ్ రెడ్డి సాధించిన విజయాన్ని పురస్కరించుకుని సదాశివనగర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు కోతి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నా రెడ్డి విఠల్ రెడ్డి, కోశాధికారి చిట్టపు అంజల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బాదం రాజా రెడ్డి, సంఘ సభ్యులు జొన్నగాం నర్సారెడ్డి, లచ్చిరెడ్డి, బాల్ రెడ్డి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొని విష్ణుచరణ్ రెడ్డిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశం సాధించడం సాధ్యమేనని పేర్కొన్నారు. విష్ణుచరణ్ రెడ్డి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మరెందరో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విష్ణుచరణ్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

# కోటాలపల్లి, లింగాయపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

**చిన్నారుల పోషకాహారం, హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన సూపర్వైజర్ పద్మజ**

**ప్రభుత్వ నిబంధనల మేరకు సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు**





**కామారెడ్డి ప్రతినిధి, జూలై 17 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి మండలంలోని కోటాలపల్లి, లింగాయపల్లి గ్రామాల అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మజ ఆకస్మికంగా సందర్శించి విస్తృతంగా తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా కోటాలపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన సూపర్వైజర్ పద్మజ, చిన్నారుల హాజరు, ప్రీ-స్కూల్ విద్యా కార్యకలాపాలు, పోషకాహార పంపిణీ, గుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం లింగాయపల్లి అంగన్వాడీ కేంద్రంలో కూడా ఇదే విధంగా తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లు, స్టాక్ వివరాలు, బరువు నమోదు, ఆరోగ్య రికార్డులు, పరిశుభ్రత తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి పునాది వంటివని అన్నారు. ప్రతి చిన్నారికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించి, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అలాగే రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, హాజరు నమోదు, పోషకాహార స్టాక్ వివరాలు, ఆరోగ్య సంబంధిత రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ అభియాన్, బాలల సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులతో కూడా సూపర్వైజర్ పద్మజ మాట్లాడి, పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, కేంద్రంలో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తనిఖీల సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను మరింత మెరుగుపరచాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అధికారులు తరచూ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలు అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన భూంపల్లి సర్పంచ్, వార్డు సభ్యుడు

గ్రామాభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరామని గైని శ్రీనివాస్ వెల్లడి

ఎమ్మెల్యే చేతుల మీదుగా పార్టీ కండువా



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 17 (ప్రజా జ్యోతి):** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్, గ్రామ వార్డు సభ్యుడు బండ శ్రీను శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, అదే నమ్మకంతో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులు ప్రజలకు మరింత చేరువై కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం పార్టీలో చేరిన భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, అదే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో ప్రస్తుతం అభివృద్ధి వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, పారదర్శక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తమను ఆకర్షించాయని చెప్పారు. భూంపల్లి గ్రామానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘ భవనం నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అందాయని వివరించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని పార్టీలో చేరిన నాయకులను అభినందించారు. భూంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ఈ చేరికలు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన రాఘవపూర్ విద్యార్థులకు ఘన సన్మానం

స్వంత నిధులతో షూస్, క్రీడా దుస్తులు అందజేసిన సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్

గ్రామానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్ష



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 17 (ప్రజాజ్యోతి):** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని, వారు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గ్రామం, మండలం, జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్ ఆకాంక్షించారు. రాఘవపూర్ గ్రామానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు గూగులోత్ అరవింద్ మరియు ట్రెయిన్ రక్షిత 400 మీటర్ల పరుగుపందెంలో స్టేట్ గేమ్స్‌కు ఎంపిక కావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్ తన స్వంత డబ్బులతో విద్యార్థులకు నాణ్యమైన క్రీడా షూస్, ట్రాక్‌సూట్లు, క్రీడా దుస్తులు కొనుగోలు చేసి అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేదని, సరైన ప్రోత్సాహం లభిస్తే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా రాణించగలరని అన్నారు. క్రీడల్లో విజయం సాధించడం ద్వారా వ్యక్తిగత గుర్తింపుతో పాటు గ్రామానికి కూడా మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో పూర్తి ఆత్మవిశ్వాసంతో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని, రాఘవపూర్ గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయపాలన, పోటీతత్వం పెంపొందుతాయని తెలిపారు. గ్రామంలోని ఇతర విద్యార్థులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా గ్రామంలోని క్రీడాకారులకు, ప్రతిభావంతులైన విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ సర్పంచ్ స్వంత నిధులతో క్రీడా సామగ్రి అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ప్రోత్సాహం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని అన్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత మాట్లాడుతూ, గ్రామంలో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ విద్యార్థులకు అండగా నిలిచి వారి విజయానికి తోడ్పడాలని కోరారు.విద్యార్థులు గూగులోత్ అరవింద్ మరియు ట్రెయిన్ రక్షిత మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి స్వంత ఖర్చుతో క్రీడా సామగ్రి అందించిన సర్పంచ్ ఎడ్ల వీనిల్ నరేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి రాఘవపూర్ గ్రామ ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.

# మైనర్ బాలిక తో అసభ్య ప్రవర్తన స్థానికుల దాడిలో మృతి

హైదరాబాద్

కులసుంపుర పోలీస్ స్టేషన్ లో దారుణం జరిగింది. తొమ్మిదేళ్ల మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోస్ సీసీ టీవిలో రికార్డు ఐయ్యాయి మైనర్ బాలికకు ముద్దు ఇస్తూ, ప్రైవేట్ పార్ట్స్ తాకుతున్న వీడియోస్ బాలిక తల్లి తండ్రులు, స్థానికులు చూసారు. ఆవేశం తో నిందుతుడిపై పేరెంట్స్ డబుల్ బెడ్ రూమ్ వాసులు దాడి చేయగా, ఉస్మానియా హాస్పటల్ లో చికిత్స పొందుతు మృతి చెందాడు. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ డబుల్ బెడ్ ట బ్లాక్ లో ఘటన జరిగింది. నిందుతుడు హాజిజ్ అబ్దుల్ నీలోఫోర్ హాస్పిటల్ లో టీ అమ్ముతు జీవనం కొనసాగిస్తున్నాడు. మైనర్ బాలిక 4బిఫ్త్ర క్లాస్ చదువుతుండగా, పేరెంట్స్ ప్రైవేట్ జాబ్స్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీడియోలు చూసిన స్థానికులు అబ్దుల్ పై దాడి చేసారు. తీవ్ర గాయాలయిన అబ్దుల్ ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది.నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సడెన్‌గా పెరిగిన ఈ కోడి గుడ్డు రేటుతో సామాన్యుడు సతమతమవుతున్నాడు.తూర్పుగోదావరి జిల్లాలో కోళ్ల ఫారాలు చాలా ఎక్కువ. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఇక్కడి గుడ్లే ఎగుమతి అవుతుంటాయి. అలాంటి తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల ఫారం వద్దే గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉంది. ఇప్పటి వరకు కోడి గుడ్డు ధర అత్యధికంగా ఉన్న రేటు కూడా ఇదే కావడం విశేషం.తూర్పు గోదావరి జిల్లాలో సాధారణంగా 1.3 కోట్లకు పైగా కోళ్లు ఉండగా రోజుకు కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల కోళ్లు కూడా చాలా ఎక్కువగానే మృతిచెందాయి. అధికారికంగా ఈ సంఖ్యం 16.35 లక్షలు ఉండగా, అనధికారికంగా 20 లక్షలకు పైగా కోళ్లే మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. దాంతో పాటు బతికిన కోళ్లు కూడా పూర్తి స్థాయిలో గుడ్లు పెట్టకపోవడంతో గుడ్ల కొరత ఏర్పడింది.ప్రస్తుతం కోళ్ల ఫారాల వద్ద గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉండగా, అదే బహిరంగ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైనే విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజు రూ. 4.94 పైసలు ఉండగా ఇప్పుడు ఆ ధర రెట్టింపయింది.

# తిమ్మక్‌పల్లిలో ఎంపీవో త్రివేద్ ఆకస్మిక తనిఖీలు

అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, గ్రామపంచాయతీ రికార్డులు, డంపింగ్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీవో

ప్రభుత్వ సేవల అమలులో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిక

నాణ్యమైన సేవలే ప్రజలకు అందాలని అధికారులకు ఆదేశాలు








**కామారెడ్డి ప్రతినిధి, జూలై 17 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయా..? గ్రామస్థాయిలో ప్రభుత్వ శాఖల పనితీరు ఎలా ఉంది..? చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యత ఎలా ఉంది..? పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందుతున్నదా..? గ్రామపంచాయతీ రికార్డులు నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా..? గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా జరుగుతోంది..? వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కామారెడ్డి మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) త్రివేద్ ఆకస్మికంగా పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలను విస్తృతంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీవో త్రివేద్, చిన్నారుల హాజరు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, గుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల పంపిణీ, ఆరోగ్య రికార్డులు, బరువు నమోదు వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, ప్రతి చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. కేంద్రం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎంపీవో, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వ విధానం, వంట చేసే పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, భోజన పాత్రల శుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందించాలని సంబంధిత సిబ్బందికి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. తదుపరి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీవో త్రివేద్, పన్నుల వసూళ్లు, నగదు పుస్తకాలు, తీర్మాన పుస్తకాలు, జనన--మరణ నమోదు, ఆస్తుల రిజిస్టర్లు, అభివృద్ధి పనుల రికార్డులు, పారిశుద్ధ్య నిర్వహణ వివరాలు, కార్మికుల హాజరు నమోదు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించి పారదర్శకంగా నిర్వహించాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పనిని నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డును సందర్శించి ఘన వ్యర్థాల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తడి--పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం, డంపింగ్ యార్డు నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సరఫరా, వీధుల పరిశుభ్రత, డ్రైనేజీల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, వేగంగా అందేలా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం సహించబోమని హెచ్చరించారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో కూడా ఎంపీవో త్రివేద్ ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై గ్రామస్థులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రపు లక్ష్మి, ఉపసర్పంచ్ గొర్రె పరమేశ్వర్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, ఆయమ్మలు, పాఠశాల సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవల మెరుగుదల కోసం అధికారులు తరచూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ సేవల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# ఓటు హక్కు కోల్పోకుండా ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించండి







18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలి

-- కామారెడ్డి తహసీల్దార్ హిమబిందు

**కామారెడ్డి, ప్రతినిధి జూలై 17 (ప్రజాజ్యోతి):** భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవడానికి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొని సంబంధిత ఫారాలను సమర్పించాలని కామారెడ్డి తహసీల్దార్ హిమబిందు పిలుపునిచ్చారు. శుక్రవారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎంతో కీలకమైందని, ప్రతి కుటుంబం దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో నివసిస్తున్న ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా లేదా చిరునామా మారినా వెంటనే సంబంధిత ఎస్ఐఆర్ దరఖాస్తులను సమర్పించి సరిచేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన గడువులోపు దరఖాస్తులు ఇవ్వని పక్షంలో భవిష్యత్తులో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉండవచ్చని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొంటూ, ఎన్నికల సమయంలో ఓటు వేయాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉండడం అత్యవసరమన్నారు. అందువల్ల గ్రామ ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు తమ జీవితంలో మొదటిసారిగా ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత ముందుకు వచ్చి ఓటరు నమోదు చేసుకోవడం ద్వారా దేశ భవిష్యత్తు నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఒక్క అర్హుడూ ఓటరు జాబితా వెలుపల ఉండకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ప్రతి ఇంటికి చేరుకొని అవగాహన కల్పించాలని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడప శ్యామ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియ, అవసరమైన పత్రాలు, కొత్త ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పు వంటి అంశాలపై అధికారులు ప్రజలకు సమగ్రంగా వివరించారు. గ్రామ ప్రజలు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చివరగా తహసీల్దార్ హిమబిందు మాట్లాడుతూ, “ఓటు హక్కు ప్రతి పౌరుడి గౌరవం.. ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ఫారాలు తప్పనిసరిగా సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి” అని పిలుపునిచ్చారు.

# హస్తినకు పోయి రావలె...

విజయవాడ,


ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలు, లాకప్ డెత్ వ్యవహారాలూ తమ పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడుల అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని సమాచారం.ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వ పెద్దలను, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఇతర కీలక నాయకులను కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏపీలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన కేంద్రానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, ఆస్తుల ధ్వంసం మరియు నమోదైన కేసుల వివరాలను ఆయన కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నారు.కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పాటు పార్లమెంట్ వేదికగా జాతీయ మీడియా మరియు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు కూడా జగన్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీకి ఉన్న ఎంపీల ద్వారా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏపీ పరిణామాలపై గళం విప్పేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన నాయకులను వేధిస్తున్నారనే కోణంలో కేంద్రానికి ఫిర్యాదు చేయడం ద్వారా, కూటమి ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావచ్చని జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జగన్ ధీమా వెనుక...

వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలను ఇంకా యాక్టివ్ చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు పూర్తయి రెండేళ్లవుతున్నా ఇంకా కొందరు నేతలు మాత్రమే పార్టీలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. అందులోనూ ఒక సామాజికవర్గానికి చెందిన నేతలే ఎక్కువగా మీడియాలో కనిపిస్తున్నారు. మిగిలిన నేతలు బయటకు రావడం లేదు. వైఎస్ జగన్ అనేక పర్యటనలు చేస్తున్నారు. జిల్లాలు తిరుగుతున్నారు. అయినా అక్కడి వరకే నేతలు పరిమితమవుతున్నారు. పూర్తి స్థాయిలో నేతలు యాక్టివ్ కాకపోవడంతో వైసీపీ క్యాడర్ కొంత అయోమయంలో ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో నేతలు కనెక్ట్ కాకుంటే గెలుపు అసాధ్యమని చెబుతున్నారు. జగన్ పర్యటనలు విజయవంతం అవుతున్నప్పటికీ ఎన్నికల సమాయానికి క్యాడర్, లీడర్ కలసి పనిచేస్తేనే కొంత సక్సెస్ లభిస్తుంది. కానీ ఇప్పుడు దాదాపు వంద నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఇంకా వేచి చూడాలని నాయకులు అనుకోవడమే.

# వివాదంలో ఆర్ ఎస్ ప్రవీణ్

**అదిలాబాద్ :** కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజాధనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్



రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్లించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయపరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు .

### పురుషులను గౌరవించడం మన సంప్రదాయం'..

# ఫ్రీ బస్ వేళ ఆర్టీసీ బస్సులో ఇంట్రెస్టింగ్ బోర్డు

**నల్గొండ :** ఆర్టీసీ బస్సులో 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో సూర్యాపేట రూట్ బస్సులో తీసిందిగా ప్రచారం జరుగుతుండగా.. దీనిపై నెటిజన్లు సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ బోర్డు నిజమైనదా లేదా ఏఐ, డిజిటల్ ఎడిటింగ్‌తో రూపొందించారా అనే విషయంపై స్పష్టత లేదు. తెలంగాణ ఆర్టీసీ కూడా ఇప్పటివరకు దీనిపై అధికారికంగా స్పందించలేదు.తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులు, ప్రయాణాలకు సంబంధించిన పోస్టులు, మహిళల కొట్లాటలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ ఆర్టీసీ బస్సులో కనిపించిన బోర్డు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా బస్సుల్లో కనిపించే 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అనే సందేశానికి బదులుగా ' పురుషులను గౌరవించడం మన సంప్రదాయం ' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఈ ఫొటో సూర్యాపేట రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సులో తీసింది అని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. దీంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. "ఇన్నాళ్లకు మాకు కూడా గౌరవం దక్కింది", "ఇకపై బస్సులో సీటు దొరికే అవకాశముంది" అంటూ కొందరు పురుషులు సరదాగా ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఈ బోర్డు నిజంగా ఆర్టీసీ ఏర్పాటు చేసిందా లేక ఎవరైనా సరదాగా మార్చారా అంటూ



సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ ఫొటో నిజమైందా కాదా అనేది మాత్రం స్పష్టత లేదు. కొందరు నెటిజన్ల అభిప్రాయం ప్రకారం.. అసలు బోర్డుపై ఉన్న స్త్రీలను అనే పదాన్ని డిజిటల్ ఎడిటింగ్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో 'పురుషులను'గా మార్చి సోషల్ మీడియాలో వైరల్ చేశారని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ బోర్డు నిజమైందా లేక ఎడిట్ చేసిందా అనే దానిపై తెలంగాణ ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉన్న నేపథ్యంలో బస్సుల్లో సీట్ల కొరత, ప్రయాణ అనుభవాలపై ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక మీమ్స్, ట్రోల్స్, పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ బోర్డు కూడా వైరల్ కావడంతో.. మరోసారి చర్చనీయాంశంగా మారింది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి ఫొటోను నిజమని నమ్మే ముందు అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు

**నిజామాబాద్ :** నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ఎఇబూ, ఉఖీఇ పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి ? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని



ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది.

తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ–కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు. నిజంగా సంజనా ప్రయాణం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం.

## డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా....

**హైదరాబాద్ :** తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్ములు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు. 2009 లో అసెంబ్లీ సీట్ల పునర్ విభజన వైఎస్సార్ కి బాగా కలిసి వచ్చింది. ఇపుడు కూడా రేవంత్ రెడ్డి అదే జరుగుతుందని భావిస్తున్నారు అంటున్నారు.ఇక రాజకీయంగా చూస్తే వ్యతిరేక ఓట్లు భారీగా వచ్చే ఎన్నికల్లో చీలిపోతాయని కూడా రేవంత్ రెడ్డి అంచనా కడుతున్నారు. విపక్షంలో బీజేపీ బీఆర్ఎస్ రెండూ పోటా పోటీగా ఉన్నాయి. ఈ రెండూ కలిసేది లేదు అని అంటున్నారు. కలుస్తాయని అందుకే పెద్ద ఎత్తున రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఇదంతా వ్యూహాత్మకం అని అంటున్నారు. ఈ రెండు పార్టీ కలిసినా అప్పటికి అది బూమరాంగ్ అవుతుందని విడిగా పోటీ చేస్తే కనుక కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీని పంచుకుంటాయని దాంతో మరోసారి గెలుపు బాట కాంగ్రెస్ దే అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమాతో ఉన్నారు అని అంటున్నారు.

## అటవీ అధికారులపై దాడి కేసు..
## మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సహా 8 మందికి జైలు శిక్ష

**అదిలాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సార్సాలలో అటవీ శాఖ అధికారులపై జరిగిన దాడి కేసులో అటవీ అధికారుల పోరాటం ఫలించింది. విధి నిర్వహణలో ఉన్న అటవీ సిబ్బందిపై కర్రలతో దాడి చేసి, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులో ఎట్టకేలకు ఆదిలాబాద్ కోర్టులో తుది తీర్పు వెలువడింది. ఆనాటి ఈఖీూ చోళే అనితపై కొందరు వ్యక్తులు అమానుషంగా దాడి చేసిన ఘటనకు సంబంధించి కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘ విచారణల తర్వాత.. ఆసిఫాబాద్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్ తో పాటు మరో ఏడుగురిని దోషులుగా నిర్ధారిస్తూ న్యాయస్థానం జైలు శిక్ష ఖరారు చేసింది.కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాల అటవీ అధికారులపై దాడి కేసులో 7 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 8 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి, ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. 2019 జూన్ 30న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కొత్త సార్సాలలో అటవీ భూమిలో మొక్కలు నాటేందుకు అధికారులు సిబ్బంది వెళ్లారు. దీంతో అక్కడి గ్రామస్థులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అప్పటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చోళే అనిత నేతృత్వంలోని బృందంపై కొందరు వ్యక్తులు కర్రలతో దాడి చేయగా, ఎఫ్.ఆర్.ఓ అనితతో పాటు పలువురు అటవీ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొత్తం 39 మందిపై హత్యాయత్నం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, దాడి, తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు పూర్తిచేసి 2020లో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా 300 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావ్, భూరం పోసం, పుల్ల శ్రీకాంత్, కొట్ట మల్లేష్, బొబ్బర శంకర్, రాజశేఖర్, భూరం మల్లేష్, శ్యామలను దోషులుగా తేల్చి 6 నెలల జైలు శిక్ష విధించింది. ఏడేళ్ల న్యాయ పోరాటం అనంతరం వెలువడిన ఈ తీర్పుతో అటవీ శాఖ అధికారులు తమకు కోర్టులో న్యాయం జరిగిందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులను సహించబోమనే స్పష్టమైన సందేశాన్ని కోర్టు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసు విచారించిన ఆదిలాబాద్ లోని ఎస్సీ, ఎస్టీ జిల్లా న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దానియా రుతు తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. రమణారెడ్డి ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించగా, ప్రస్తుత కాగజ్ నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్ నోడల్ ఆఫీసర్ గా ఉన్నారు. కాగజ్ నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఈశ్వర్ సింగ్ లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారణ సజావుగా జరిగేలా చేశారు.

## అల్పపీడనం... పలు ప్రాంతాల్లోవానలు

**హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనికి తోడు కోస్తాంధ్ర, తెలంగాణ మీదుగా మహారాష్ట్ర వరకు ప్రస్తుతం ద్రోణి విస్తరించి ఉంది. ఈ మార్పుల ప్రభావంతో శుక్రవారం ఏపీ వ్యాప్తంగా ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణశాఖ అధికారులు స్పష్టం చేశారు. గంటకు 40– 50 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. వర్షం కురుస్తున్నప్పుడు, ఉరుములు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని, తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యంతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మిగిలిన జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్తర ఒడిశా – పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ గురువారం తెలిపింది. అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో శుక్రవారం నాడు ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది. ఈ జిల్లాల్లో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని ప్రజలను అప్రమత్తం చేసింది. శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.మరోవైపు, తెలంగాణలో నిన్న పలు జిల్లాల్లో అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు, తేలికపాటి జల్లులు కురిశాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 4.3 సెంటీమీటర్లు, నల్గొండ జిల్లా చండూరులో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్ష సూచన ఉన్నప్పటికీ పలు జిల్లాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా నిజామాబాద్‌లో గరిష్టంగా 35.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది ఈ సమయంలో సాధారణం కంటే 3.5 డిగ్రీలు అధికమని తెలిసిందే.

## తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో
## బాధపడుతున్న వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు.మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి కోలుకుని ప్రజా సేవలో కొనసాగాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

## పాదయాత్రలకు నేతలు..

**హైదరాబాద్ :** మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలుకానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల రాజకీయాల్లో ఈ పాదయాత్రలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.జగన్‌కు పాదయాత్ర కొత్త కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2019 జనవరిలో ముగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన 3,648 కిలోమీటర్లకు పైగా నడిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకున్నారు. ఆ పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు.మరోవైపు కేటీఆర్ కు ఇది తొలి పాదయాత్ర కానుంది. ఇప్పటివరకు ఆయన రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్ష పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో పునర్వ్యవస్థీకరించేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడం, రానున్న ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధమవడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ప్రజల స్పందనను బట్టి ఈ యాత్రలు రానున్న ఎన్నికల రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ఈసారి కథ మారింది!

అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. 'పెద్ది' హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది'రంగస్థలం' తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలోస్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.



# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?


'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హను-మాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.



# రాకా కోసం దీపిక సాహసం?

ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం. అంతేకాదు, తన 'ఎనిమిది గంటల పని' నిబంధనను కూడా ఈ సినిమా విషయంలో ఆమె పక్కన పెట్టారని తెలిసింది. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందు, 'రాకా'లో తన పార్ట్ షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని ఆమె నిర్ణయించారట. అటు షూట్‌లో పాల్గొంటూనే ఇటు తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటూ, లొకేషన్‌లో నటిగా, తల్లిగా రెండు బాధ్యతలనూ నిర్వర్తిస్తూ అందరి దృష్టినీ దీపిక ఆకర్షించారట. దీపిక తన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకునే తీరును చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిస్తున్నారు.





# రాజు.. జాకీ.. రాణి

1990ల కాలంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామా 'కేజేక్యూ'. 'ఖఱఅస్త్ర జీుఎఎఱవ ౨బవవఅ' అనేది ఉపశీర్షిక. దసరా, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్‌శెట్టి హీరోగా, శశి ఓదెల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి స్వర్గీయ కె.కె దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ చిత్ర దర్శకుడు కేకే గత ఏడాది కన్ను మూశారు. ఆయనకు సినిమాపై ఉన్న పాషన్, విజన్‌కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే ప్రచార చిత్రాల వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, సినిమా తప్పకుండా ప్రేక్షకులకు ఓకొత్త అనుభూతినిస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. యుక్తి తరేజా కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెస్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967